క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



సనత్‌నగర్: బేగంపేట్, ఆల్విన్, గ్రీన్‌ల్యాండ్స్, హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లీలానగర్, విద్యుత్ టవర్, రైల్వే ట్రాక్ ఏరియా, జెక్‌కాలనీ, బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్, సెయింట్ థెరిస్సా హాస్పిటల్.

- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీనివాస టవర్స్, అమోఘ్ ప్లాజా, మేటాస్, బ్లూ మూన్ హోటల్, మనీ ల్యాండ్ చైనా, వరుణ్ మోటార్స్, సొనాటా, కట్టమైసమ్మ టెంపుల్, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, సూర్యోదయ బిల్డింగ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

రేపు ఓయూలో మహా ధర్నా

లాలాపేట: ఈ నెల 15న ఉస్మానియా యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పరశురాం తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆవిష్కరించారు. తమను రెగ్యూలరైజ్ చేయాలనే డిమాండ్‌తో నిర్వహిస్తున్న మహాధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీల నుంచి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు హాజరవుతారన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసిన సంతోష్‌కుమార్

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్‌కుమార్ తన పుట్టిన రోజు వేడుకను ఆ పార్టీ నాయకులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డివిజన్ అధ్యక్షులు హనుమంత్‌రావు, కూతురు నర్సింహ, కట్ట బలరాం, లక్ష్మి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక



చెక్కు అందజేస్తున్న పద్మారావుగౌడ్

లాలాపేట: బోనాల జాతర సందర్భంగా గురువారం లాలాపేటకు చెందిన పలువురు ఆలయ కమిటీ సభ్యులు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. లాలాపేటలో అమ్మవారి దేవాలయాల వద్ద ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. పెద్ద ఎత్తున వేడుకల నిర్వహణకు ఆర్థిక సహాయం చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. లాలాపేటలో జరిగే బోనాల ఉత్సవాలకు రావాలని కోరుతూ పద్మారావుగౌడ్‌ను ఆహ్వానించారు. అనంతరం ఆలయ కమిటీ నాయకులు మల్లికార్జున్‌కు చెక్కును అందజేశారు.

నేడు మంత్రి తలసాని పర్యటన

బన్సీలాల్‌పేట్: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ నెల 14 (శుక్రవారం) బన్సీలాల్ పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. కార్పొరేటర్ హేమలతతో కలిసి ఉదయం 9.30ని డివిజన్‌లోని బోయిగూడ, కీస్‌బ్లాక్, జలమండలి బోయిగూడ సెక్షన్ కార్యాలయం, డాన్‌బోస్కో స్కూల్, ఉప్పలమ్మ దేవాలయం తదితర ప్రాంతాల్లో పర్యటిస్తారు. నూతన రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ నిర్మాణాలను ప్రారంభిస్తారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.75, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 85, బజ్జీమిర్చి 75, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 14, క్యారెట్ 47, దొండ 19, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 65, గోకరకాయ 28, కీర 19, దోసకాయ 18, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 21, చామగడ్డ 40, మొరంగడ్డ 31, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 15, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

అమ్మవారికి ప్రీతిపాత్రం.. కదంబ వృక్షం

చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయంలో కనువిందు చేస్తున్న కదంబ పుష్పాలు



చిలకలగూడ : పురాతన భారతీయ వైద్యశాస్త్రమైన ఆయుర్వేదంతో పాటు ఆధ్యాత్మిక గ్రంథాల్లోనూ కదంబవృక్షం ఎంతో మహత్తరమైనదిగా పేరు గాంచింది. సర్వరోగాలను నయం చేసే శక్తి కదంబ వృక్షానికి ఉందని, లలితా సహస్రనామాల్లో అమ్మవారిని కదంబ వనవాసినిగా పూజిస్తారని పురాణాలు చెబుతున్నాయి. అలాంటి కదంబవృక్షం విరబూసిన పుష్పాలతో చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయ ప్రాంగణంలో కనువిందు చేస్తోంది. ఆషాఢమాసంలోనే ఈ చెట్టు పుష్పిస్తుంది. బంతి ఆకారంలో కదంబ పుష్పాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు నుంచి పద్దెనిమిదేళ్ల క్రితం కదంబ మొక్కను తెచ్చి నాటినట్లు ఆలయ ప్రధాన అర్చకులు తిరుమలాచార్యులు తెలిపారు. సంరక్షణ చర్యలు చేపట్టడంతో మొక్క పెరిగి వృక్షమైందని ఈ పుష్పాలంటే అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమని 'కదంబవనవాసం' అనే ప్రాచీన గ్రంథంలో పేర్కొన్నారు. అమ్మవారికి అత్యంత ఇష్టమైనందుకే ఆలయ ప్రాంగణంలో కదంబ చెట్టును పెంచామన్నారు. మధురైలోని మధుర మీనాక్షి దేవాలయ ప్రాంగణంలో కదంబవృక్షం నేటికీ ఉందని వివరించారు.

ఔషధగుణాలు అధికం..

కదంబవృక్షంలో మహోత్తరమైన ఔషధగుణాలు అధికంగా ఉన్నాయని రాజనిఘంటు అనే ఆయుర్వేద శబ్దార్థ గ్రంథంలో పేర్కొన్నారు. కదంబవృక్ష కాండం, ఆకులు, పుష్పాలు, కాయలు పలురకాల రోగాలు, అస్వస్థతలను నయం చేసేందుకు వినియోగిస్తారు. కదంబవృక్షం ఇండియా, ఆస్ట్రేలియా, చైనా, మలేషియా, గినియా, సింగపూర్, వియత్నాం తదితర దేశాల్లో పెరుగుతాయి.

అమ్మవారికి అలంకరణ..

ఆషాఢ మాసం మొదలైన నాటి నుంచి కదంబపుష్పాలు విరివిగా పుష్పిస్తాయి. కట్టమైసమ్మ, నల్లపోచమ్మ అమ్మవార్లకు నెలరోజుల పాటు నిత్యం కదంబపుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కదంబవృక్షానికి పూజలు చేస్తే అంతా మంచే జరుగుతుందని భక్తుల నమ్మకం. చిలకలగూడ బోనాల జాతర ఈనెల 16,17 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్ తెలిపారు.



కదంబపుష్పాల అలంకరణలో అమ్మవారు



చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయ ప్రాంగణంలోని కదంబవృక్షం

బోనాలకు రావాలని మంత్రికి ఆహ్వానం



మంత్రికి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ కాలనీ బంగారు మైసమ్మ ఆలయంలో ఈ నెల 16న నిర్వహించే బోనాల ఉత్సవాలకు రావాలని ఆలయ కమిటీ సభ్యులు మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌కు గురువారం ఆహ్వానపత్రికను అందించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో తయారు చేస్తున్న పోచంపల్లి పట్టుచీరను శుక్రవారం అమ్మవారికి సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. బోనాల వేడుకలకు మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్‌లతో పాటు పలువురు కార్పొరేటర్లు, అధికారులు హాజరవుతారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ధనశేఖర్, ప్రకాశ్, ప్రమోద్, శైలేందర్, జగదీష్, బాబురావు, అశోక్ ఉన్నారు.

డిప్యూటీ మేయర్‌కు..

లాలాపేట: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ పరిధిలోని చిలకలగూడలోని కట్టమైసమ్మ దేవాలయంలో వచ్చే ఆదివారం నిర్వహించనున్న బోనాల జాతరకు రావాలని గురువారం సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డిని ఆమె కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఆలయ కమిటీ నిర్వాహకులతో కలిసి వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను డిప్యూటీ మేయర్‌కు అందజేశారు.

గ్రేటర్‌ను చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్

చిలకలగూడ : గ్రేటర్ హైదరాబాద్‌ను చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను పకడ్బందీగా అమలు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ అన్నారు. సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్లు, పారిశుద్ధ్య అధికారులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా తగిన చర్యలు చేపట్టాలని, చెత్త వేసే పాయింట్లను గుర్తించడంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. సర్కిళ్ల వారీగా చెత్త డంపింగ్ పాయింట్లు, ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే విధి విధానాలపై ఆరా తీశారు. ఆయా సర్కిళ్ల పరిధిలోని చెత్త కుండీలను శాశ్వతంగా తొలగించడంతో పాటు మళ్లీ ఆ ప్రాంతంలో చెత్త వేయకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, కమిషనర్లు రవికిరణ్, శ్రీనివాసరెడ్డి, పంకజా, మమత, జాయింట్ కమిషనర్లు ఉమాప్రకాశ్, సంధ్యలతో పాటు రాంకీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు



విద్యార్థులకు హెల్మెట్లు అందిస్తున్న దృశ్యం

ఏసీపీ శంకర్‌రాజు

రాంగోపాల్‌పేట్: మానవ తప్పిదాల వల్లే అత్యధిక ప్రమాదాలు జరుగుతూ మరణాలు సంభవిస్తున్నాయని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు. గురువారం సికింద్రాబాద్ ఎస్వీఐటీ కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్ లాంటి వాటితో అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మైనర్లకు వాహనాలను ఇచ్చిన వాళ్లకు 3 ఏళ్ల జైలుతో పాటు రూ.25 వేల జరిమానా ఉంటుందని, వాహన రిజిస్ట్రేషన్ రద్దు అవుతుందన్నారు. మైనర్లు పోలీసులకు పట్టుబడితే ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులు కారని చెప్పారు. 2022లో హైదరాబాద్ నగరంలో 317 రోడ్డు ప్రమాదాలు జరిగితే 323 మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లైసెన్సు ఉన్న విద్యార్థులకు కోటక్ మహేంద్ర బ్యాంకు సహకారంతో ఉచితంగా హెల్మెట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేశ్వరరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహ, టీటీఐ ఎస్సై జ్యోతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషాశ్రీ, ఏవో ప్రకాష్, కోటక్ మహేంద్ర స్టేట్ హెడ్ చందన్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

బౌద్ధనగర్: ఫుట్‌పాత్ ఆక్రమణలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని చిలకలగూడ ట్రాఫిక్ ఎస్‌ఐ కరుణాకర్ తెలిపారు. గురువారం సాయంత్రం వారాసిగూడ ప్రాంతంలో ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమణలకు పాల్పడుతున్న వారికి చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు చలానాలు విధించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. ప్రయాణికులు, పాదచారులకు ఇబ్బందులు కలిగించే విధంగా రోడ్డు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి ఆక్రమణల వల్ల రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేది లేదన్నారు.

వృద్ధుడి అదృశ్యం



వెంకట్ రావు

బౌద్ధనగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈస్ట్ గోదావరికి చెందిన వెంకట్‌రావు (75) బౌద్ధనగర్‌లోని వారాసిగూడలో ఉంటున్న కుమారుడు లవ కుమార్ ఇంటికి ఈ నెల 12న వచ్చాడు. అయితే.. మధ్యాహ్నం భోజనం చేసి బయటకు వెళ్లిన వెంకట్‌రావు ఇంటికి తిరిగిరాలేదు. ఆందోళనకు గురైన లవ కుమార్ బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

అడ్డగుట్ట: రైలు కింద పడి గుర్తు తెలియని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 12న సాయంత్రం 6.30 సమయంలో సికింద్రాబాద్‌లోని లోయర్ యార్డ్ క్యాబిన్ దగ్గర సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి 25–30 ఏళ్ల వయస్సు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు నలుపు, ఎరుపు, బూడిద రంగు టీ–షర్ట్, బూడిద కలర్ ప్యాంట్ ధరించి ఉందని మృతిని చేతి పై ఇంగ్లిష్‌లో లక్ష్మీ అని పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు.

మరో ఘటనలో..

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లోని యార్డ్ పాయింట్ వద్ద గురువారం సుమారు 35- 40 ఎళ్ల మధ్య వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కాగా మృతిడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు.

గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ..

బన్సీలాల్‌పేట్: అనారోగ్య సమస్యలు.. తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు కథనం ప్రకారం.. కవాడిగూడ తాళ్లబస్తీకి చెందిన ఆర్. రమేష్ (33) గత కొంత కాలం నుంచి అనారోగ్య సమస్యలతో వైద్య సేవలు పొందుతూ తాగుడుకు బానిసై సతమతవుతున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

మెడికల్ దుకాణంలో చోరీ

రాంగోపాల్‌పేట్: ఓ మెడికల్ దుకాణంలో దొంగతనానికి పాల్పడిన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేటకు చెందిన తరుణ్ మంత్రి, పీనుగుల మల్లన్న దేవాలయం ప్రాంతంలో హిందూస్థాన్ డ్రగ్ పేరుతో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున దుకాణం తెరవగా క్యాష్ కౌంటర్‌ను పగులగొట్టి ఉంది. అందులో ఉన్న రూ.15 వేలు నగదు లేనట్టుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ వ్యక్తి వచ్చి షట్టర్‌ను ఎత్తుతున్నట్లు గుర్తించారు.

కేటీఆర్ మాటలు నమ్మం

- నిధులు, భూబదలాయింపు అంశాల్లో అబద్ధాలు చెబుతున్నారు
- బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: రాష్ట్ర మంత్రి కేటీఆర్ గాలి మాటలు నమ్మే పరిస్థితిలో లేమని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. కంటోన్మెంట్‌కు నిధుల విడుదల విషయంలో ఆది నుంచీ అబద్ధపు మాటలతో గారడీ తప్ప చేసిందేమీ లేదన్నారు. భూబదలాయింపు విషయంలోనూ మంత్రి కేటీఆర్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడని దుయ్యబట్టారు. ఇదే విషయాన్ని రక్షణ శాఖ మాజీ డైరెక్టర్ అజయ్ కుమార్ స్వయంగా తనతో చెప్పాడంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంటోన్మెంట్‌కు ఎగువన ఉన్న కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన మురుగు నీటి ప్రవాహాన్ని నేరుగా కంటోన్మెంట్‌లోకి వదులుతూ ఉండటాన్ని తాము అడ్డుకుంటూ వచ్చామన్నారు. కంటోన్మెంట్ పరిధిలోని ప్రభావిత కాలనీ వాసులతో కలిసి ఒత్తిడి తెచ్చామన్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కంటోన్మెంట్‌లోని నాలా వరకు ప్రత్యేక డ్రైనేజీ లైను వేసేందుకు ముందుకొచ్చారని అన్నారు. ఇందుకు సంబంధించి రూ.30 కోట్లు ఎస్‌ఎన్‌డీపీ ద్వారా విడుదల అయ్యాయంటూ బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇక తిరుమలగిరి చెరువు అభివృద్ధి పనుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పాత్ర ఏమీ లేదన్నారు. బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న నేతకు కంటోన్మెంట్ ప్రాంత సమస్యలపై అవగాహన లేదన్నారు. ప్రైవేటు స్థలంలో ఉన్న పెద్ద కమేళాను భూబదలాయింపు జాబితాలో చేరుస్తామనడం, బజార్ ల్యాండ్‌లను క్రమబద్ధీకరిస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అవగాహన లేకుండా కేంద్రాన్ని విమర్శిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కంటోన్మెంట్‌ల విలీన ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ వాయిదా పడుతూ వచ్చిందన్నారు.

విలీనం సరే.. మా సంగతేంటి?



బోర్డు ఉద్యోగుల ఆందోళన

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనానికి ముందే తమ భవితవ్యం తేల్చాలంటూ బోర్డు ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. బోర్డు ఉద్యోగుల సంఘం నేతలు మహేందర్, ఉమాశంకర్, పరుశరామ్ నేతృత్వంలో గురువారం బోర్డు ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌ల విలీనానికి సంబంధించి కేంద్రం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. వివిధ అంశాలపై స్పష్టత ఇస్తున్న కేంద్రం, ఉద్యోగుల విషయాన్ని మాత్రం తేల్చడం లేదన్నారు. ఇటీవలే సమీప మున్సిపల్ ప్రాంతంలో విలీనం అయిన ఉత్తరాది కంటోన్మెంట్‌లో ఉద్యోగుల సర్వీసును పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఇదే విధానాన్ని మిగతా కంటోన్మెంట్‌లలోనూ అమలు చేస్తే తాము తీవ్రంగా నష్టపోతామన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని కంటోన్మెంట్‌లలో సుమారు 15వేల మంది పర్మినెంట్, 20 వేలకు పైచిలుకు కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. వీరి భవిష్యత్‌పై స్పష్టత ఇవ్వాలన్న డిమాండ్‌తో గురువారం దేశ వ్యాప్తంగా అన్ని కంటోన్మెంట్‌లలో ఆందోళన చేపట్టామన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఉద్యోగుల ఇళ్ల స్థలాల సమస్య కొలిక్కి వచ్చిన నేపథ్యంలో విలీనానికి ముందే స్థలాలు కేటాయించాలన్నారు.

ఆందోళన వద్దు : సీఈఓ

ఉద్యోగులు సర్వీసు విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఈఓ మధుకర్ నాయక్ అన్నారు. ఉద్యోగుల ఆందోళనతో అక్కడికి వచ్చిన సీఈఓ మాట్లాడారు. జీహెచ్‌ఎంసీలో విలీనం అనంతరం, బోర్డు ఉద్యోగలకు ప్రమోషన్‌తో పాటు ఒక ట్రెండు ఇంక్రిమెంట్‌లు అడగాలన్నారు. ఈ మేరకు తాను సైతం డైరెక్టర్ జనరల్ ఉద్యోగులకు సిఫారసు చేస్తానని అన్నారు. కంటోన్మెంట్ పరిధిలో 102 మంది కారుణ్య నియామకాల విషయంలోనూ త్వరలోనే సానుకూల నిర్ణయం వెలువడే అవకాశం ఉందన్నారు. బోర్డు సభ్యుడు రామకృష్ణ మాట్లాడుతూ బోర్డు ఉద్యోగుల ఆందోళన విషయాన్ని మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు ఉద్యోగులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సత్యశీల్, సూపరింటెండెంట్‌లు నర్సింగ్‌రావు, యానీ, రమణ, ఇంజనీర్లు బాలకృష్ణ, ఉమాశంకర్, గోపాలకృష్ణ, సిబ్బంది రాజేశ్, నర్సింహా రాజు, ఎం.ఆర్. రాజు, శేఖర్, చిరంజీవి, అషుతోష్, పుష్పేందర్, ఉమానంద్, ప్రజ్వల, స్వాతి పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి



పోచమ్మ దేవాలయానికి వెళ్లే మార్గంలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు

బౌద్ధనగర్: బోనాల పండుగ నేపథ్యంలో రోడ్లకు మరమ్మతులు చేయకుండా కాలయాపన చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులపై బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బౌద్ధనగర్ డివిజన్‌లోని వారాసిగూడ పోచమ్మ దేవాలయానికి వెళ్లే మార్గంలో రెండు నెలల క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ల కోసం రోడ్డు తవ్వారు. పనులు పూర్తి అయిన రోడ్డు వేయకుండా అలాగే వదిలేశారు. దీంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారులు నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాక ఈ నెల 16న వారాసిగూడ పోచమ్మ దేవాలయం వద్ద బోనాల జాతర ఘనంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డుపై మహిళలు బోనం ఎత్తుకొని వెళ్లేందుకు ఇబ్బందులు వస్తాయన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ రోడ్డు సమస్య దృష్టిలో లేకపోవడంతో గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే రోడ్డు వేయాలని కోరుతున్నారు.

రూ. 2 కోట్లతో సంగీత్ జంక్షన్ విస్తరణ పనులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోనే అతిపెద్దదైన సంగీత్ చౌరస్తా జంక్షన్ పనులను ఇటీవల ప్రారంభించారు. జంక్షన్ విస్తరణ కోసం సుమారు రూ.2 కోట్లు కేటాయించి జంక్షన్‌లో వివిధ రకాల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ముఖ్యంగా జంక్షన్ విస్తరణతో అధికారులు ఫ్రీ లెఫ్ట్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇస్కాన్ ఎదురుగా విశాలమైన ఫుట్‌పాత్‌ను నిర్మించి అక్కడ కొంత గ్రీనరీని పెంచి బెంచీలు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ప్రజలను ఆకట్టుకునే సంగీత పరికరాలు ఏర్పాటు చేయడంతో ఇక్కడ విశాలంగా ఐ ల్యాండ్ ఏర్పాటు చేస్తున్నారు. రైల్వే గెస్ట్ హౌజ్ ఎదురుగా, అపోలో నుంచి వచ్చి కుడివైపు తీసుకునే కార్నర్‌లో కూడా ఐ ల్యాండ్స్ ఏర్పాటు చేస్తున్నారు. గురువారం గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భరతకుమార్, జీహెచ్‌ఎంసీ ఏఈ రవీందర్, సీఆర్‌ఎంపీ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులు ప్రయోగాత్మకంగా దీన్ని పరిశీలించారు. అలాగే మెట్టుగూడ నుంచి వచ్చే వాహనాలు ఇస్కాన్ వైపు వెళ్లేందుకు తీసుకునే మలుపు కూడా కుంచించుకునిపోవడంతో వాహనాల వేగం పూర్తిగా మందగిస్తుంది. దీంతో రైల్ నిలయం వైపు ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నగరంలోనే అతిపెద్దదైన ఈ జంక్షన్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులు పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందని వాహనదారులు అంటున్నారు.

ఓయూలో జీ-20 పోటీలు



పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు

లాలాపేట: జీ–20 యూనివర్సిటీ కనెక్ట్‌లో భాగంగా ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన క్విజ్, వ్యాసరచన, వకృత్వ పోటీలను గురువారం ప్రిన్సిపాల్ ప్రొ. గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా వారిలోని నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ అనుబంధ కళాశాలల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో విజేతలైన వారికి శుక్రవారం దూరవిద్యా కేంద్రం ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొ. స్టీవెన్‌సన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సును ఉపసంహరిస్తున్నాం

ఓయూ రిజిస్ట్రార్

లాలాపేట: గత ఐదేళ్ల నుంచి ఆదరణ తగ్గుతున్న నిజాం కళాశాలలోని సెల్ఫ్ ఫైనాన్స్ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సును 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఉపసంహరిస్తున్నట్లు ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల తీరు తెన్నులను సమీక్షించిన తర్వాతనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా యూనివర్సిటీ ఎప్పటికప్పుడు కోర్సుల ప్రగతిని సమీక్షిస్తోందన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ఇటీవల కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, డాటా సైన్స్ వంటి పలు కోర్సులను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. 2008లో ఐదేళ్ల సమీకృత కోర్సును అందుబాటులోకి తెచ్చామన్నారు. కాలక్రమేణా కోర్సులో చేరే వారి సంఖ్య తగ్గిపోయిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సీట్లు సైతం భర్తీకాని పరిస్థితి ఉందని 250 సీట్లకు కేవలం 113 మంది మాత్రమే ఈ కోర్సులో చేరారని వివరించారు.

ఘనంగా ఫలహార బండ్ల ఊరేగింపు



పోతరాజులతో కలిసి ఫలహారబండ్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రసూల్‌పురా: ఆషాఢ బోనాల జాతరలో భాగంగా గురువారం లాల్‌బజార్ మహంకాళి ఆలయం వద్ద బ్యాండ్ మేళాలు. డప్పుల దరువులు పోతరాజుల నృత్యాల నడుమ ఫలహారబండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఫలహార బండ్ల ఊరేగింపు కార్యక్రమానికి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీ గణేష్, వార్డు మహిళ అధ్యక్షురాలు నాగినేని సరిత వేర్వేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫలహార బండ్ల ఊరేగింపులో తీసుకు వచ్చిన నైవేద్యాన్ని అమ్మవార్లకు సమర్పించారు.ఈ కార్యక్రమంలో శశాంక్, భరత్, ప్రవీణ్, చంటి, శామ్యూల్,గిరి, కార్తీక్, విఘ్నేష్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379